క్లుప్తంగా

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


జిట్టా అజయ్‌కుమార్

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన జిట్టా ఆంజనేయులు, సుశీలమ్మ దంపతుల కుమారుడు జిట్టా అజయ్‌కుమార్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు సూపర్‌సెవెన్ జిల్లా కార్యదర్శి భాస్కర్ బుధవారం తెలిపారు. ఈ నెల 10, 11 తేదీలలో మద్దికెరలో జరిగిన రాష్ట్రస్థాయి సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలలో రెండు ఓవర్లు బౌలింగ్ చేసి రెండు వికెట్లు కూల్చడమేగాక కేవలం 4 పరుగులు ఇచ్చి ప్రత్యర్థిని కట్టడి చేశారని, అలాగే బ్యాటింగ్ 14 బంతుల్లో 54 పరుగులు చేసి సత్తా చాటడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన సదస్సు

హాలహర్వి: మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ గంగాధర పిలుపునిచ్చారు. మంగళవారం అర్ధగేరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంపై ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 0–5 సంవత్సరాల పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఆ రోజున వేయించుకోని వారిని 4, 5 తేదీల్లో రెండు గ్రూపులుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. పీహెచ్‌ఎన్ పద్మలత, ఎంపీహెచ్‌ఓ మోహన్, ఎంఎల్‌హెచ్‌పీలు బ్యూల, రాజేశ్వరి, ప్రియాంక, ఏఎన్‌ఎం రిందా, చిట్టి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంజీవయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆలూరు: మాజీ సీఎం దామోదరం సంజీవయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది పిలుపునిచ్చారు. సంజీవయ్య జయంతి కార్యక్రమం బుధవారం స్థానిక వాసవీ కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహానంది మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా పనిచేసిన సంజీవయ్య ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. మాలల సంఘం నాయకులు లక్ష్మినారాయణ, వెంకటరాముడు, ఈరన్న, మల్లికార్జున, గాదిలింగప్ప, బసవరాజ్, లక్ష్మన్న, గోవిందు తదితరులు ఉన్నారు.

16న బంద్‌కు పిలుపు

వెల్దుర్తి(కృష్ణగిరి): దేశవ్యాప్తంగా ఈనెల 16న రైతులు తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు మాధవస్వామి ఆధ్వర్యంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సీపీఐ మండలాధ్యక్షుడు టి.కృష్ణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్య, ఆటో యూనియన్ జిల్లా నాయకుడు ఏసన్న పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు చట్టాలను కాలరాసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. సీపీఐ మండల కార్యదర్శి రాజు, రైతు సంఘం అధ్యక్షుడు బాలరాజు, మాధవకృష్ణ, వెంకటేశ్, చిన్నమాదులు పాల్గొన్నారు.

ఆస్పరి: ఈనెల 16వ తేదీన కార్మికులు చేపట్టే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని మండల రైతు సంఘం నాయకులు హనుమంతు, విరుపాక్షి పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వామపక్ష ప్రజా సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. సీపీఐ నాయకులు కృష్ణమూర్తి, బాలకృష్ణ, రంగస్వామి, రాజశేఖర్, బ్రహ్మయ్య, అంజినయ్య పాల్గొన్నారు.

హొళగుంద: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికుల, ప్రజావ్యతిరేక విధానాలను వీడాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. బుధవారం వారు హొళగుందలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె, భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ, సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోనెగండ్ల: మండల పరిధిలోని గాజులదిన్నె గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రామకృష్ణ కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో మంగళవారం రాత్రి సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి అతని వద్ద 30 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే సమాచారం అందివ్వాలని ప్రజలకు సూచించారు.

నెరవేరనున్న దశాబ్దాల కల

- మార్లమడికి డబుల్ రోడ్డు పనులు ప్రారంభం
- భూమి పూజ చేసిన మంత్రి గుమ్మనూరు జయరాం, సమన్వయకర్త విరూపాక్షి


మార్లమడికి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం


పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి

హొళగుంద: దశాబ్దాల కాలంగా ఆంధ్ర–కర్ణాటక సరిహద్దు ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కల నెరవేరబోతుందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి అన్నారు. వారు బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మార్లమడికి రోడ్డు పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాలను కలిపే 5 కి.మీ మార్లమడికి పంచాయతీరాజ్ రోడ్డును రెండు లైన్ల రహదారిగా మార్చేందుకు రూ.5.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి ఎల్లెల్సీ బ్రిడ్జి దాటి కొద్ది దూరం వరకు (400 మీటర్లు) డబుల్ సీసీ రోడ్డు అక్కడి నుంచి మార్లమడికి వరకు దాదాపు 4 కి.మీ డబుల్ తారు రోడ్డు వేయనున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది కర్ణాటకలోని బళ్లారి, సిరుగుప్ప పట్టణాలతో పాటు ఇతర ప్రాంతాలకు హొళగుంద, పల్లెల నుంచి విద్య, వైద్యం, ఇతర పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు దెబ్బతిని అధ్వానంగా ఉండడంతో ప్రభుత్వం కొత్తగా రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా బుధవారం భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ.. మార్లమడికి రోడ్డు నిర్మాణం పూర్తయితే కర్ణాటక ప్రజలు ఆంధ్రాకు వచ్చేందుకు, ఇక్కడి ప్రజలు ఆ రాష్ట్రానికి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నాలుగు సరిహద్దు రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్లు వేసేందుకు రూ.21 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి వైపు నడిపిస్తున్న వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ నారాయణ, పార్టీ మండల కన్వీనర్ షఫీవుల్లా, ఈశా, పంపాపతి, మల్లికార్జున, కోగిలతోట శేషప్ప, ఎస్కే గిరి, తోక వెంకటేష్, అయ్యాళప్ప, దొడ్డబసప్ప, రవిస్వామి, మల్లికారున, కెంచప్ప, రాంభీంనాయుడు, పీఆర్ పీఐయూ ఈఈ వెంకటప్రసాద్, కాంట్రాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


సరస్వతీ పూజ చేస్తున్న దృశ్యం

మద్దికెర: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దాత హనుమంతురావు (పెరవలి జెడ్పీ హైస్కూల్ 1982 బ్యాచ్ పదో తరగతి విద్యార్థి) అన్నారు. పాఠశాలలో ఆయన సహకారంతో రూ.15 లక్షలతో నిర్మించిన సరస్వతి మండపం నాల్గవ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అలాగే వసంత పంచమి పురస్కరించుకొని సరస్వతీ దేవికి అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ పిల్లలతో తరలివచ్చారు. దాత సహకారంతో చిన్నారులకు పలకలు, బ్యాగులు పంపిణీ చేసి అక్షరాభ్యాసం చేయించారు. ప్రధానోపాధ్యాయులు రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు. పూజలకు విచ్చేసిన వారికి అన్నదానం చేశారు.

‘సిద్ధం’ సభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. బుధవారం పత్తికొండలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పదవీ కాలంలో ప్రజారంజక పాలన సాగించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎంకు దక్కిందన్నారు. రాబోయే ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలకు సిద్ధం అని సవాల్ విసురుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే భీమిలి, దెందులూరులో జరిగిన సిద్ధం సభలకు జనం నీరాజనం పలికారన్నారు. రాయలసీమలోని రాప్తాడులో జరిగే సిద్ధం సభ వాటికి మించి విజయవంతం చేసేలా పార్టీ నాయకులు కృషి చేస్తున్నారన్నారు. పత్తికొండ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం సభకు తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. 5 మండలాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని, భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జుల ఉరుకుందమ్మ, ఎంపీపీ నారాయణదాసు, ఆర్.వెంకటేశ్వర్లు, మాధవరావు, టీఎండీ హుసేన్, శ్రీరంగడు, కారం నాగరాజు, సోమశేఖర్, భాస్కర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలో ఇటీవల ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గరిక మనోహర్‌ను, ఎం.అగ్రహారం గ్రామంలో ఈ ఏడాది సంక్రాంతి రోజున ఆత్మహత్య చేసుకున్న లోకేష్ కుటుంబసభ్యులను బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధైర్యపడొద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ విజయుడు, నాయకులు భద్రయ్య, రాము, ప్రతాప్, వెంకటేశులు ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పత్తికొండలో పోస్టర్లు విడుదల చేస్తున్న రామచంద్రారెడ్డి తదితరులు

పత్తికొండటౌన్: అనంతపురం జిల్లా రాప్తాడులో జరగనున్న సిద్ధం సభను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కేడీసీసీ మాజీ వైస్‌చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ దంపతులు పిలుపునిచ్చారు. బుధవారం పత్తికొండలో పార్టీ నాయకులతో కలిసి సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 18న రాప్తాడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొనే సిద్ధం సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కొమ్ము నెట్టేకల్లు, శ్రీరంగడు, నార్ల రంగడు, మల్లికార్జున, బాషా, సుంకన్న, మధు, రంగన్న, రామాంజనేయులు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

నేడు చెరుకులపాడుకు ఎమ్మెల్యే రాక

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం తన స్వగ్రామం చెరుకులపాడులో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సిద్ధం సభ పోస్టర్లు ఆవిష్కరించనున్నట్లు కృష్ణగిరి ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, వెల్దుర్తి మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. అలాగే వెల్దుర్తి మండలంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను అందించనున్నట్లు తెలిపారు.

ఈ–కేవైసీకి నేడే ఆఖరు


గోనెగండ్లలో పంట నమోదు చేస్తున్న అధికారులు (ఫైల్)

గోనెగండ్ల: ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పెట్టుబడి సాయం పొందాలంటే రైతులు విధిగా ఈ–కేవైసీ చేయించుకోవాలి. తాము పండించిన పంటకు ఈ–క్రాప్ నమోదుతో పాటు ఈ–కేవైసీ చేయించాలి. తద్వారా ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే పరిహారం పొందే అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పెట్టుబడి సాయం పొందాలంటే గడువులోగా ఈ–కేవైసీ చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం పొందే అవకాశం ఉండదని అధికారులు హెచ్చరిస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, వైఎస్సార్ రైతు భరోసా పథకాల ద్వారా ఏటా రైతులకు రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఈ సొమ్మును ఏడాదిలో మూడు విడతలుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. మండలంలో ప్రస్తుత రబీ సీజన్‌లో 7,747 ఎకరాలలో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ఇప్పటివరకు ఈ–క్రాప్ బుకింగ్ వంద శాతం పూర్తి కాగా 90 శాతం మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నారు.

రైతులు నమోదు చేయించుకోవాలి



ఈనెల 15వ తేదీతో ఈ–కేవైసీ, ఈ–క్రాప్ నమోదు గడువు ముగుస్తుంది. ఈ–కేవైసీ చేయించుకోని రైతులు గ్రామ సచివాలయం, ఆర్‌బీకే లేదా వలంటీర్ల ద్వారా నమోదు చేయించుకోవచ్చు. ఇప్పటికే మండలంలో వంద శాతం ఈ–క్రాప్, 90 శాతం ఈ–కేవైసీ పూర్తిచేశాం. అందుబాటులో లేని రైతులు తమ సన్నిహితుల ద్వారా ఆధార్, సెల్ నంబర్లు తెలియజేసి అనుసంధానం సమయంలో ఓటీపీ నంబర్ చెప్పి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి.

– హేమలత, ఏఓ, గోనెగండ్ల

అమర జవాన్లకు నివాళి


వెల్దుర్తిలో నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఐదేళ్ల క్రితం జరిగిన పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు బుధవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు నివాళులర్పించారు. స్థానిక పాతబస్టాండులో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈదమ్మ, వరలక్ష్మి, రేణుక, రిజ్వాన, జ్యోతి, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ కార్డుతో కార్మికులకు భరోసా

ఆలూరు రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–శ్రమ్ కార్డులతో అసంఘటిత కార్మికులకు భరోసా లభిస్తోందని ఆలూరు కార్మిక శాఖ అధికారిణి కనక లక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, టైలరింగ్, చేతి వృత్తులు, తోపుడు బండ్ల వారు, వీధి వ్యాపారులు, పాల వ్యాపారులు, ఇళ్లలో పనిచేసే పని మనుషులు, క్షురకులు, పండ్ల విక్రేతలు, చేతి వృత్తుల వారు తదితర పనులు చేసే వారందరూ ఈ–శ్రమ్ కార్డులకు నమోదు చేసుకోవాలన్నారు. ఆలూరు నియోజకవర్గంలో 1,45,884 మంది కార్మికులు ఉన్నారని, ఇప్పటివరకు 78,895 మంది ఈ–శ్రమ్ కార్డులు పొందినట్లు చెప్పారు. ఇంకా 67,289 మంది కార్మికులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ–శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న కార్మికులకు సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ.2 లక్షలు బీమా, అంగవైకల్యం పొందితే రూ.1 లక్ష సాయం అందుతుందన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో ఓ ఇంటికి వెళ్లే దారిలో గోడ కట్టారని ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎలిశమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లే దారిలో అడ్డంగా గోడ కట్టారనే విషయంలో తిరుపతమ్మతో పాటు మరో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయమై ఎలిశమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తిరుపతమ్మతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఘటనపై గ్రామంలో విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

బాధ్యతగా పనిచేయాలి

తుగ్గలి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో సచివాలయ సిబ్బందిదే కీలక పాత్ర అని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఎద్దులదొడ్డి, పెండేకల్లు సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించడంతో పాటు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆరోగ్య శ్రీ యాప్ లాగిన్, కులగణన సర్వే, జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. అనంతరం ఎద్దులదొడ్డిలో వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డితో కలిసి సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు చేరవేసి పరిష్కారం చూపాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అంకాలప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

నందవరం: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దటి తలెత్తలేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీపీ లక్ష్మీదేవమ్మ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లెల్లో నీటి సమస్యలకు తావులేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అలాగే జలజీవన్ పథకం కింద మండలానికి రూ.12 కోట్లు మంజూరయ్యాయని, ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని సూచించారు. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యం, నీటి వసతులు, విద్యుత్ దీపాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభలో వివరించారు. తహసీల్దార్ ఓబులేసు, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, పరిపాలనాధికారి కృష్ణమూర్తి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు సమర్థవంతంగా పనిచేయాలి

ఆలూరు రూరల్: బూత్ లెవల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన ఆలూరులోని 132 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఓటర్లు అన్ని సౌకర్యాల మధ్య ఓటు హక్కు వినియోగించుకునేలా వసతులు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ర్యాంపులు, వికలాంగులకు వీల్ చైర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులపై నివేదిక తయారు చేసి ఆర్వోకు అందించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులను ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలన్నారు. ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట


దైవందిన్నెలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న సంఘం నాయకులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామ బస్‌స్టాప్ సమీపంలో బుధవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కనులపండువగా జరిగింది. విగ్రహానికి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం జనసమూహం, జై వాల్మీకి మహర్షి నినాదాల మధ్య విగ్రహావిష్కరణ చేపట్టారు. గ్రామ పెద్దలు, నాయకులు జానకి రామిరెడ్డి, వాల్మీకి విగ్రహ కమిటీ నాయకులు బోయ గోకారి, రంగన్న, తిప్పన్న, చిన్న అంజనేయ, నాగేష్, రామలింగడు, కృష్ణ, తలారి మహేష్, పుండుకూర నరసింహులు, బజారి, బొడ్డన్న, నరసింహులు, బుడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రామాయణ మహాకావ్యం రచించిన వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విగ్రహ మహోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులే గాకా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వాల్మీకులు తరలివచ్చారు. వాల్మీకి సంఘం నాయకులు డాక్టర్ పార్థసారథి, గుడిసె కృష్ణమ్మ, మాధవరం రాఘవేంద్ర రెడ్డి, వీజీఆర్ కొండయ్య, రంగముని, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం


గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బుట్టా రేణుక

నందవరం: రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కురవ పరమేష్ కుమారుడు వీరేష్ వివాహానికి ఆమె హాజరయ్యారు. ముందుగా గ్రామంలో వెలసిన దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి, పార్వతి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. పేదలకు అండగా నిలిచిన జగనన్నకు మనమందరం తోడుగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శివారెడ్డిగౌడ్, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, గురజాల సర్పంచ్ వీరస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠప్ప, నరసింహారెడ్డి, నరసింహులు తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ ఓబులేసు

నందవరం: నవతర్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని తహసీల్దార్ ఓబులేసు సూచించారు. ఆయన బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో జగనన్న కాలనీలో ఇంటి పట్టాల పొందిన లబ్ధిదారులకు పక్కాగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. మండలంలో 1298 మంది లబ్ధిదారులు ఇంటి పట్టాలు పొందారన్నారు. అందులో ఇప్పటివరకు 869 మందికి రిజిస్ట్రేషన్ పూర్తి చేశామన్నారు. ఇంకా 429 మందికి పెండింగ్ ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు సమాచారం అందించి త్వరగా పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్లను పర్యవేక్షించాలన్నారు. ఆర్ఐ జెర్మియా, జూనియర్ అసిస్టెంట్ జనార్ధన్‌రావు, కంప్యూటర్ ఆపరేటర్ చాంద్‌బాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 9.379 టీఎంసీల నీటి నిల్వ


తుంగభద్ర జలాశయం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర ఉమ్మడి జలాశయంలో బుధవారం 9.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాంలో నీటి చేరిక (ఇన్‌ఫ్లో) నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 163 క్యూసెక్కులుంది. నీటిమట్టం 1587.92 అడుగుల మేర ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో నీటిమట్టం 1611.56 అడుగుల వద్ద 40.742 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఇదిలా ఉండగా తాగునీటి అవసరాల నిమిత్తం ఎల్లెల్సీకి ఆంధ్ర, కర్ణాటక కోటా నీటిని ఈ వారంలో వదిలే అవకాశాలున్నాయని బోర్డు అధికారులు తెలిపారు.